నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
6 | మహబూబ్‌నగర్, సోమవారం 30 డిసెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సెంటిమెంట్‌ను దెబ్బ తీయొద్దు

- తిరుమలలో తెలంగాణ–ఏపీ వివక్ష లేకుండా దర్శనాలు కల్పించాలి
- టీటీడీ మన రాష్ట్ర రాజకీయ పార్టీల నేతల సిఫారస్ లేఖలు స్వీకరించాలి
- ఆనవాయితీని వ్యతిరేకిస్తే అరిష్టం
- రాజకీయంగా మాట్లాడం లేదు
- గద్వాలలో మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గద్వాల, డిసెంబర్ 29 : తిరుమలలో వెంకన్న దర్శనాల విషయంలో సెంటిమెంట్‌ను దెబ్బతీయొద్దని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ, ఏపీ అన్న తేడా లేకుండా.. వివక్ష చూపకుండా అందరికీ సమానంగా దర్శనభాగ్యం కల్పించాలన్నారు. తెలంగాణ సిఫారస్ లేఖలను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జములమ్మ అమ్మవారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత బాసు హన్మంత్ నాయుడు స్వగృహంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవుడి దృష్టిలో అందరూ సమానమే అన్నారు. తిరుమలలో మన రికమండ్ లెటర్లు తీసుకోవడం లేదని, ఏపీ సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజలకు ఆంధ్రా ప్రాంతంతో ఉన్న ఏకైక సంబంధం తిరుపతి అన్నారు. గతంలో ఉన్న సంప్రదాయాలను ప్రస్తుతం కొనసాగించడం లేదన్నారు. గతంలో మన నేతల సిఫారస్ లేఖలు అనుమతించే వారని గుర్తు చేశారు. ప్రస్తుతం తీసుకోక పోవడంతో ఇక్కడి ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు, ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. వెంకన్న స్వామి అందరి ఇష్టదైవమని, ఇక్కడున్న ప్రతి ఇంటిలో ఒకరి పేరు స్వామి పేరు ఉండేలా పెట్టుకుంటారని తెలిపారు. కానీ దర్శనాల విషయాని కొస్తే మాత్రం వివక్ష చూపుతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రజలకు, ప్రతినిధులకు గతంలో కల్పించిన సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జోగుళాంబ దేవికి దసరా ఉత్సవాల సమయంలో కర్నూల్ కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, అలాగే తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో గద్వాల నుంచి పట్టు పంచెలు నేచి సమర్పించడం ఆనవాయితీ అన్నారు. ఆనవాయితీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అది అందరికీ అరిష్టమన్నారు. ఇదినేను రాజకీయంగా మాట్లాడడం లేదని, భక్తుల పక్షాన.. వారు పడుతున్న బాధలు.. పొందుతున్న ఆవేదనను మీ ముందు ఉంచుతున్నానని చెప్పారు. తెలంగాణ–ఆంధ్రా నాయకులు అన్న తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన విధానం అమలు చేయాలన్నారు. ఎన్టీఆర్ గొప్ప నేత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని కల్పించిన గొప్పవ్యక్తి అని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ప్రతిష్టను కొందరు దిగజార్చడానికి యత్నిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద అసెంబ్లీ నిర్మిస్తామని కొందరు మాట్లాడం సరికాదని, ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. మంచి వ్యక్తులను గౌరవించే సంస్కృతీ సంప్రదాయం తెలంగాణ ప్రజలదన్నారు. సమావేశంలో బాసు శ్యామల, రవి ప్రకాశ్‌గౌడ్, కిషోర్, మోనేశ్, తిరుమల్, బీచుపల్లి, ఎస్.రాము, శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి ఎనలేనిది..

- వెంకట్రామిరెడ్డి సేవలను స్మరించిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 29 : మహిళా, ఉన్నత విద్యాభివృద్ధికి రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి కృషి ఎనలేనిదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెంకట్రామిరెడ్డి ముందుచూపుతో ఆనాడే మహిళల కోసం ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు చేశారన్నారు. మహిళల విద్యను ఎంతో ప్రోత్సహించారని గుర్తు చేశారు. 106 ఏండ్ల కిందట దేశాభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించారని, ముందుచూపుతో ఆలోచన చేసి, మెరిక ల్లాంటి విద్యార్థులను తయారు చేసి దేశానికి అందించిన ఘనత రెడ్డి హాస్టల్‌దేనని అన్నారు. నేటి సాంకేతికతతో పోటీపడి ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయ విధానాన్ని అందించి రాబోయే తరాల కోసం ఈ సంస్థ తోడ్పాడాలని ఆకాంక్షించారు. రాజాబహద్దూర్ సేవలను కొనియాడారు.

ప్రశ్నార్థకంగా పల్లీపంట!

వేరుశనగ పంటను పండించడంలో వనపర్తి జిల్లా రికార్డును మూటగట్టుకున్నది. కానీ నేడు మళ్లా వెనక్కి వెళ్తున్నది. గతంలో ఉన్న సాగుబడుల అంచనాలను తలకిందులు చేస్తూ ఈ ఏడాది పూర్తిగా తగ్గిపోయింది. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడం కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సబ్సిడీపై పల్లీ పంపిణీకి చెక్ పెట్టడంతో రైతన్నలు పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. దీంతో వేరుశనగ సాగు గణనీయంగా పడిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడంతో నాడు వేల ఎకరాల్లో పండిన పల్లీ.. నేడు కాంగ్రెస్ హయాంలో గణనీయంగా తగ్గిపోయింది.

– వనపర్తి, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ)

- ప్రభుత్వ సబ్సిడీ ప్రోత్సాహం నిల్
- పెరిగిన విత్తన ఖర్చుతో తగ్గుదల
- గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు
- వనపర్తి జిల్లాలో యాసంగిలో 10వేల ఎకరాలకే పరిమితం
- ప్రత్యామ్నాయ పంటల వైపు రైతన్నల దృష్టి సారింపు
- దూరమవుతున్న అఫ్లాటాక్సిన్ రహిత పంట
- కేసీఆర్ ప్రభుత్వంలో అధిక విస్తీర్ణంలో సాగు

కేసీఆర్ ప్రభుత్వంలో పెద్దపీట

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం సాగునీటి వనరులు కల్పించింది. రైతు సంక్షేమమే ధ్యేయంగా అన్ని చర్యలు తీసుకున్నది. రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, సబ్సిడీపై విత్తనాలు.. పండిన పంటకు మద్దతు ధర చెల్లింపు.. పుష్కలంగా సాగునీరు.. వంటి చర్యలతో వ్యవసాయం పండుగలా సాగింది. అంతకుముందు వనపర్తి జిల్లాలోని 14 మండలాలకుగానూ కేవలం కొన్ని మండలాలకు మాత్రమే జూరాల ఆధారిత నీరు అందేది. మిగితా మండలాలకు అందని పరిస్థితి. తెలంగాణ ఏర్పడ్డాక సాగు నీటికి ప్రాధాన్యత ఇవ్వడం, పెండింగ్ ప్రాజెక్టులను సైతం పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు నీరందించారు. దీంతో ఒక్కసారిగా సాగుబడులు భారీగా పెరిగాయి. జిల్లాలో జియోగ్రాఫికల్ ప్రకారం 5.40 లక్షల ఎకరాల భూములుంటే.. వీటిలో 4.31 లక్షల ఎకరాలు సాగుకు యోగ్యమైనవిగా వ్యవసాయ శాఖ అంచనాలున్నాయి. ఈ మేరకు గడిచిన వానకాలంలో 2.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో 1.96 లక్షల ఎకరాల్లో కేవలం వరిని సాగు చేశారు. దీని మేరకు ఎక్కువ శాతం రైతులు వరి వైపు మొగ్గు చూపుతుండగా.. ఇతర పంటలను కేవలం పదుల సంఖ్యలోనే సాగుబడులు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఐదారేళ్ల వెనక్కి వెళితే వేరుశనగను 60 వేల ఎకరాలకుపైగా సాగు చేసిన రైతులు ప్రస్తుతం పూర్తిగా తగ్గించారు.

10వేల ఎకరాలకే పరిమితం

జిల్లాలో రైతాంగం వేరుశనగ సాగుకు పూర్తిగా దూరమవుతోంది. గతంలో 60 నుంచి 70వేల ఎకరాల్లో వేరుశగ పంటను సాగు చేశారు. కేఎల్ఐ, భీమా ఎత్తిపోతల నీళ్లు సమృద్ధిగా రావడంతో కొత్త ఊపులో భారీగా వేరుశనగ పంటను వేసుకున్నారు. లోతట్టు ప్రాంతం మొదలు కొని ఎత్తయిన గుట్టల ప్రాంతాల్లోని భూముల్లో సహితం వేరుశనగను పండించారు. పెద్ద మొత్తంలో సాగుబడులు చేసిన పరిస్థితుల నుంచి రైతులు క్రమంగా ఒక్కొక్క ఏడాది వెనక్కి తగ్గుతూ వచ్చారు. ఇలా గతేడాది యాసంగిలో 18 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తే.. ఈ ఏడాదిలో కేవలం 10వేల ఎకరాల్లోనే సాగు చేసిన అంచనా ఉంది. ఇలా ఇంత భారీ మొత్తంలో పల్లీ పంటకు దూరం కావడానికి రైతులు ఎన్నో కారణాలు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

వేరుశగ సాగు చేసే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. గతంలో విత్తనాలు వేసే సమయంలో సబ్సిడీపై గ్రామాల్లో లారీల కొద్దీ వేరుశగను పంపిణీ చేసే పరిస్థితులు ఉండేవి. క్రమంగా సబ్సిడీ ప్రోత్సాహం దూరం కావడం.. విత్తన ధరలు భారీగా పెరగడంతో రైతన్నలు ప్రత్యామ్నాయ దిశగా అడుగులు వేస్తున్నారు. ఎకరాలో 80 నుంచి 100 కేజీల విత్తనాలను రైతు వేయాలంటే తక్కువలో తక్కువ రూ.10 వేలు (ఎరువులు మినహా) ఖర్చు అవుతోంది. గతంలో సబ్సిడీ ఇస్తుండడంతో రైతులకు భారం అనిపించలేదు. దీనికి తోడు పొలాల్లో అడవి పందులు, కోతుల బెడద సైతం ఆటంకంగా మారాయి. అలాగే మద్దతు ధరలు అంతంతే ఉండటం, తెగుళ్ల బాధలు వెరసి సాగుకు అన్నదాత దూరమయ్యే పరిస్థితులు దాపురించాయి.

అఫ్లాటాక్సిన్ రహిత పంటగా గుర్తింపు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో.. అందులో వనపర్తి ప్రాంతంలో పండించే వేరుశనగ పంట అఫ్లాటాక్సిన్ రహితంగా పండుతుందని శాస్త్రవేత్తలు తేల్చారు. కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా నిరంజన్‌రెడ్డి ఉన్న సమయంలో శాస్త్రవేత్తల ద్వారా పరీక్షలు చేయించగా ఈ నిజం వెల్లడైంది. ఇక్కడి వేరుశనగలో ఫంగస్ లేకపోవడంతో మార్కెట్‌లో పల్లీలకు డిమాండ్ ఏర్పడింది. క్వాలిటీ, రుచితో పాటు ఇతర డ్రై పౌడర్స్‌కు ఈ వేరుశనగను ఉపయోగించే అవకాశం ఉండడంతో ప్రాధాన్యత అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఇంతలా నాణ్యతగా ఉన్న వేరుశనగ పంట సాగు పూర్తిగా తగ్గిపోవడంతో ప్రశ్నార్థకమవుతోంది.

పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు

జిల్లాలో వేరుశనగ సాగుబడులు భారీగా ఉన్నందునా ఈ ప్రాంతంలో వేరుశనగ పరిశోధన కేంద్రంతోపాటు రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాలు జరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా ఉన్న నిరంజన్‌రెడ్డి కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పెద్దమందడి మండలం వీరాయిపల్లిలో సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే దిశగా అడుగులు పడ్డాయి. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తల బృందం అప్పట్లో గ్రామానికి వచ్చి పరిశీలన చేసింది. తర్వాత ప్రభుత్వం మారడంతో వేరుశనగ పరిశోధన కేంద్రం ఏర్పాటు ప్రయత్నం అటకెక్కింది.

వనపర్తి జిల్లాలో 9 ఏండ్ల నుంచి పల్లీ సాగు వివరాలు

సంవత్సరం	వానకాలం..	యాసంగి ఎకరాల్లో..
2016-17	4,658	60.693
2017-18	6,061	59,446
2018-19	1,505	53,701
2019-20	3,422	43,379
2020-21	4,267	33,164
2021-22	2,782	31,654
2022-23	7,709	22,601
2023-24	5,113	18,061
2024-25	7,886	10,000 (అంచనా)

రైతులు మార్పు కోరుతుండ్రు

వనపర్తి రైతులు పంట మార్పును నిరంతరం చేపడుతుంటారు. అయితే వేరుసెనగ పంట సాగుబడి చాలా వరకు తగ్గింది. దీనికి కారణాలు అనేకం ఉన్నాయి. ఆడవిలో జంతువుల బాధలు ఎక్కువగా ఉండడం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు. అందుకే వేరుశనగ సాగుబడిలో కొంత మార్పు కనిపిస్తుంది.

- గోవిందర్‌నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, వనపర్తి

పొద్దస్తమానం కావలే..

బుడ్డలు పండితేనే ఆదాయంలో రైతులు పెద్దగా అవుతాడని మా చిన్న తనంలో పెద్దలు చెప్పేటోళ్లు.. కానీ ఇప్పుడు సాగు చేస్తే పైసలు కూడా మిగలని పరిస్థితి. వేసుకున్నా మనుషుల నుంచి.. జంతువుల నుంచి పంటను కాపాడు కోవాలంటే పొద్దస్తమానం పొలం వద్దే కావలి కాయాలే.. అంతే కాకుండా పిరం పెట్టుబడులు.. కూలీ రేట్లను తలచుకుంటే భయమైతుంది.. అందుకే వరి పంట మాత్రమే వేసుకుంటున్నాం.

- కుర్వ విమలన్న, రైతు, అమరచింత

సబ్సిడీపై పల్లీ విత్తనాలు ఇస్తలేరు

గత ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు ఇస్తుండ్రి. ఇప్పుడు ఇస్తలేరు. దీని వల్ల బయట విత్తనాలు కొనాలంటే చాలా ఖర్చు అవుతుంది. విత్తనాల కొనుగోలు, ట్రాక్టర్‌కు, కలుపు కూళ్లు, బుడ్డల నూర్పిడికి మొత్తం కలిసి ఎకరా పంట సాగు చేయాలంటే రూ. 30 వేల వరకు ఖర్చు అవుతుంది. అధికంగా పెట్టుబడి అవుతుండడం, వాతావరణం సహకరించక అధిక వర్షాలు పడటం, తెగుళ్లతో దిగుబడి తక్కువగా రావడం వల్ల రైతులు వేరుశనగ సాగు చేయాలంటే ఆసక్తి చూపడం లేదు. అందుకే సాగు విస్తీర్ణం తగ్గుతోంది. గత ప్రభుత్వంలో వ్యవసాయ అధికారులు సకాలంలో కే–6 రకం వేరుశనగ విత్తనాలు క్వింటాకు 45 శాతం సబ్సిడీపై రూ.4,500 అందజేసేది.

దీంతో రైతులకు విత్తనాల కొనుగోలులో పైసలు ఆదా అవుతుండే. విత్తనాలు బయట కొనాలంటే మొత్తం ధర పెట్టాలి. సాగు ఖర్చులకు భయపడి ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. నేను 4 ఎకరాల్లో పల్లీ వేశాను. అధికఖర్చు, అధిక వర్షాలు, తెగుళ్లతో దిగుబడి చాలా తక్కువగా వచ్చింది. 31 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది.. తక్కువ ధరకే అమ్మాను.. కష్టంపోను పెట్టుబడి మీన పడింది.

- ఆర్.భాస్కర్, రైతు, గోపాల్‌పేట, వనపర్తి జిల్లా


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 29 : అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, తాగు, సాగునీరు.. ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తానన్నారు. నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ వారి సమస్యలను తీరుస్తానని భరోసానిచ్చారు. ప్రజలందరూ పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. వివిధ అనారోగ్య సమస్యలు, మృతుల కుటుంబాలకు, ఆపద్బంధు కోసం సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీ ఎందరికో అందజేశామన్నారు. అనంతరం ఉండవల్లి మండలం బైరాపురానికి చెందిన హుస్సేన్ మియాకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.21 వేలు, అలాగే రాజోళి మండలం తుమ్మిళ్లకు చెందిన మద్దిలేటికి రూ.8 వేలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, అనంద్, రఘురెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గజేందర్ రెడ్డి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

తీగలాగితే..

డొంక కదిలింది..

- ఒక్క బైక్ కోసం వెళ్తే.. పోలీసులకు దొరికిన 30 వాహనాలు

మద్దూరు (కొత్తపల్లి), డిసెంబర్ 29 : ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటనలో విచారణ చేసేందుకు పోలీసులు వస్తే వారికి పదుల సంఖ్యలో వాహనాల ఆచూకీ లభ్యమైన సంఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు..

హైదరాబాద్‌లో ఒక వ్యక్తి వివిధ రకాల బైకులను దొంగతనం చేసి ఇతరులకు విక్రయిస్తుంటాడు. అయితే కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తికి హైదరాబాద్‌లో బైక్ దొంగ పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో ఏడాది కాలంగా లో రాష్ట్ర రాజధానిలో చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను ఇద్దరు కలిసి గ్రామానికి తీసుకొచ్చి విక్రయిచేటోళ్లు.. కాగా తన బైక్ పోయిందని చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో కాడే రంజిత్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఆధారాలు సేకరించే క్రమంలో చోరీ జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాల ఆధారంగా అనుమానితుడిని పట్టుకొని విచారించారు. అతడు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్‌కు 140 కిలోమీటర్ల దూరంలోని కొత్తపల్లి మండలం నిడ్జింత వాసి రాజుతో కలిసి బైక్ బైక్ విక్రయించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు గ్రామానికి వచ్చి రాజును పట్టుకొని విచారణ చేశారు. దీంతో అసలు విషయం చెప్పాడు. మొత్తం 30 బైకుల గురించి వివరాలు తెలిపాడు. అన్ని బైకులను గ్రామంలోనే విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో 12 రాయల్ ఎన్‌ఫీల్డ్, 18 బైకులను గుర్తించి స్వాధీనం చేసుకొన్నారు. వీటిని సీజ్ చేసి ప్రైవేట్ వాహనంలో హైదరాబాద్‌కు పోలీసులు తీసుకెళ్లారు. చోరీలపై విచారణ చేస్తున్నట్లు చైతన్యపురి సీఐ గురుస్వామి తెలిపారు.

నిడ్జింతలో చోరీకి గురై పోలీసులకు పట్టుబడిన వివిధ రకాల బైక్‌లు

ఆర్డీఎస్‌కు చేరని నీళ్లు

- నాలుగు రోజులుగా టీబీ డ్యాం నీటి విడుదల
- వచ్చిన నీటిని తోడేసుకుంటున్న కన్నడ రైతులు
- ఆందోళనలో ఆనకట్ట ఆయకట్టుదారులు

అయిజ, డిసెంబర్ 29 : ఆర్డీఎస్ నీటి వాటాను కర్ణాటక రైతులు అక్రమంగా తోడేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లే కర్ణాటకలో ఏర్పాటు చేసిన లిఫ్టులు, మోటర్ల ద్వారా అక్కడి రైతులు మళ్లించుకుంటున్నారు. దీంతో ఆర్డీఎస్‌కు నీరు చేరడం గగనంగా మారింది. జోగులాంబ గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలో పరిధిలో సాగు చేసిన 37 ఎకరాలకు పంటలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆర్డీఎస్ నీటి వాటాలో 1.078 టీఎంసీల నీటిని తుంగభద్ర డ్యాం ఈ నెల 26న నుంచి విడుదల చేయించారు. జనవరి 5 వరకు కొనసాగనున్నది. అయితే విడుదలైన నీరంతా శనివారం రాత్రి ఆర్డీఎస్‌కు చేరాల్సి ఉన్నా ఇంకా రాలేదు. కర్ణాటక రైతులు మాన్వి, సిరిగుప్ప, గబ్బూరు గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలతో పాటు స్థానిక రైతులు మోటార్ల ద్వారా పంటల సాగుకు నీటిని విని యోగిస్తున్నారు. దీంతో ఆనకట్టకు నీరు రాలేదని తెలంగాణ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన నీటిని వచ్చినట్లే తోడేస్తే రైతులకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. కన్నడ లిఫ్టులకు నీటిని ఎత్తిపోయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్డీఎస్‌లో ప్రస్తుత నీటి మట్టం

జాయింట్ ఇండెంట్‌తోనే..

రెండు రాష్ట్రాల జాయింట్ ఇండెంట్‌తోనే తెలంగాణలోని ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు ఏపీలోని కర్నూల్ జిల్లా కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు ప్రయోజనం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు టీబీ డ్యాం నుంచి తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఆర్డీఎస్, కేసీ కెనాల్ నీటి వాటాను ప్రతి ఏటా 60–40 రేషియో ప్రకారం టీబీ డ్యాం నుంచి జాయింట్ ఇండెంట్ విడుదల చేయాల్సి ఉంటుంది. గతేడాది నుంచి ఏపీ ప్రభుత్వం ఆర్డీఎస్ ఇండెంట్‌తో కలిసి కేసీ కెనాల్ ఇండెంట్‌ను టీబీ డ్యాం ద్వారా తీసుకోకపోవడంతో ఇరు రాష్ట్రాల రైతులు నష్టపోతున్నారు. ఏపీలోని కర్నూల్ ఇరిగేషన్ అధికారులు కేసీ కెనాల్ ఇండెంట్‌ను ఆర్డీఎస్ ఇండెంట్‌తో కలిసి వినియోగించకుండా హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ కాల్వల ద్వారా కేసీ కెనాల్ నీటి వాటాను వినియోగిస్తుండటంతో ఆర్డీఎస్ కర్షకులతోపాటు ఏపీలోని తుంగభద్ర నదీతీర ప్రాంతాల రైతులు లబ్ధి పొందడం లేదు. 60 శాతం కర్నూల్‌లోని కేసీ కెనాల్, 40 శాతం ఆర్డీఎస్ నీటి వాటాను టీబీ డ్యాం నుంచి విడుదల చేసేందుకు కలిసి రావాలని రైతులు ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం జాయింట్ ఇండెంట్‌కు మొగ్గుచూపాలని ఇరు రాష్ట్రాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


జంగిరెడ్డి చిత్రపటం వద్ద నేతల నివాళి

మల్రికి నేతల పరామర్శ

తిమ్మాజిపేట, డిసెంబర్ 29 : తండ్రినిని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పలువురు పరామర్శించారు. మండలంలోని నేర్లపల్లిలోని ఆయన ఇంటికి ఆదివారం మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి చేరుకొని మర్రిని పరామర్శించి ధైర్యం చెప్పారు. జంగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట విండో వైస్ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, నేతలు ఉన్నారు.

పెరిగిన క్రైం రేట్

- నేరాల అదుపులో పోలీసుల ఫెయిల్యూర్
- అధికమైన రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, లైంగికదాడులు
- సొమ్ము రికవరీలో వెనుకబాటు
- ఆందోళన కలిగిస్తున్న చీటింగ్, సైబర్ నేరాలు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 29 : గతేడాదితో పోల్చితే ఈ ఏడాది దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై లైంగిక దాడులు, హత్యలు కిడ్నాప్‌లు, దారి దోపిడీలు, హత్యలు, సైబర్ నేరాలు పెరిగాయి. తాళాలు వేసిన ఇండ్లే లక్ష్యంగా దొంగలు బీభత్సం సృష్టించారు. రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. నేరాలు, చోరీలను అదుపు చేయడంలో జిల్లా పోలీసు శాఖ పురోగతి సాధించలేక పోయింది. జిల్లాలో 2023లో 5,867 కేసులు నమోదు కాగా 2024లో 5,887 కేసులు నమోదవ్వడం విశేషం. అయితే చిన్న పాటి నేరాలు, సైబర్ నేరాలు, చీటింగ్ వంటి మోసాల్లో గతడాది కంటే గణనీయమైన పెరుగుదల నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో 2024 ఏడాదికి సంబంధించి క్రైం రౌండప్‌పై ఆదివారం ఎస్పీ జానకి విలేకరుల సమావేశంలో క్రైం నివేదికను విడుదల చేసి ప్రధాన కేసుల వివరాలను వెల్లడించారు.

పోలీసు స్టేషన్ల వారీగా ..

జిల్లాలో నమోదైన ఎఫ్ఐఆర్ కేసుల్లో జడ్చర్ల పోలీసు స్టేషన్ 913 కేసులతో మొదటి స్థానంలో ఉండగా మహబూబ్‌నగర రూరల్‌లో 844 కేసులు నమోదయ్యాయి. అత్యల్పంగా మహిళా పోలీసు స్టేషన్ 130, మూసాపేట్ పోలీసు స్టేషన్ 204 కేసులు నమదవ్వడం విశేషం. మహబూబ్‌నగర్ వన్‌టౌన్‌లో 332, టుటౌన్‌లో 438, కోయిలకొండలో 242, హన్వాడలో 255, నవాబ్‌పేటలో 310, మహ్మదాబాద్‌లో 314, భూత్పూర్‌లో 308, మూసాపేటలో 204, అడ్డాకులలో 226, దేవరకద్రలో 238, బాలానగర్‌లో 301, రాజాపూర్‌లో 301, మిడ్జిల్‌లో 300 కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

జిల్లాలో గతేడాది కంటే ఈ సారి రోడ్డు ప్రమాదాలు అధికమవడంతో పాటు మరణాల సంఖ్య పెరిగింది. 257 కేసుల్లో 273 మంది వాహనదారులు మృతి చెందారు. 272 కేసుల్లో 476 మంది వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎంవీఐ యాక్టు కేసులు 1,74,955, డ్రంకన్ డ్రైవ్ కేసులు 2,033 నమోదయ్యాయి. అయితే జైలుకు వెళ్లిన వారి సంఖ్య తగ్గింది. రూ.8,20,98,515 జరిమానాలు విధించారు.

వార్షిక నేర వివరాలను వెల్లడిస్తున్న పాలమూరు ఎస్పీ జానకి

హడలెత్తించిన చోరీలు

ఈ ఏడాది జిల్లాలో చోరీల సంఖ్య గణనీయంగా పెరిగింది. మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీతోపాటు గ్రామాల్లోనూ దొంగలు హడలెత్తించారు. అయితే దొంగతనాలను అరికట్టడంతోపాటు, చోరీకి గురైన సొమ్ము రికవరీ చేయడంలోనూ పోలీసులు వెనుకబడ్డారు. చోరీ అయిన సొమ్ము రూ.3 కోట్ల 83 లక్షలు ఉంటే రికవరీ మాత్రం రూ.కోటి మాత్రమే చేశారు.

**పాలమూర